సాక్షి
మహబూబ్‌నగర్
శుక్రవారం ¦ 19 ¦ జనవరి ¦ 2024

గరిష్టం/కనిష్టం
33.1 /15.2
వాతావరణం
ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. ఉదయం, రాత్రి చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు ప్రభావం ఉంటుంది.




నమో.. నారసింహా

ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధిగాంచిన సింగపట్నం (సింగోటం) లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం గురువారం కనులపండువగా సాగింది. పట్టువస్త్రాలు, బంగారు భరణాలు, వివిధ రకాల పుష్పాలతో దివ్య మంగళకరంగా అలంకరించిన స్వామివారిని రథంపై ఊరేగించారు. ప్రధాన ఆలయం నుంచి రత్నగిరికొండ వరకు భక్తులు స్వామివారి రథాన్ని లాగి పునీతులయ్యారు.

- వివరాలు 8లో..

అయోమయం..

ప్రభుత్వ మార్పుతో సబ్సిడీ గొర్రెల పంపిణీపై నీలినీడలు

- డీడీలు తీసింది వేలల్లో.. అందింది వందల్లో
- డబ్బులు పోయాయంటూ గ్రామాల్లో ప్రచారం
- ఆందోళనలో గొర్రెల పెంపకందారులు
- పశువైద్య సిబ్బంది చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణలు



మహబూబ్‌నగర్ రూరల్/గండేడ్: గొల్ల, కురుమలను ఆదుకోవాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం గొర్రెల పెంపకం దార్లకు గొర్రెల పంపిణీకి శ్రీకారం చుట్టింది. అయితే మొదటి విడత పంపిణీ సజావుగా సాగినా.. రెండో విడతకు మాత్రం ఆటుపోట్లు ఎదురయ్యాయి. వరుసగా రెండేళ్ల కరోనా ప్రభావం, ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు ఆశనిపాతంగా మారాయి. కొంతమంది లబ్ధిదారులకు మాత్రమే అందగా మిగతా వారికి వివిధ కారణాలతో బ్రేక్ పడింది. దీంతో డీడీలు కట్టిన లబ్ధిదారులు అటు గొర్రెలు.. ఇటు డబ్బులు రాక లబోదిబోమంటున్నారు. మొదటి విడతలో యూనిట్ విలువ రూ.1.25 లక్షలు ఉండగా రెండో విడతలో యూనిట్ విలువ రూ.1.75 లక్షలకు పెంచారు. ఇందులో లబ్ధిదారుడు వాటాగా రూ.43,750లు కాగా.. రూ.1,31,250 ప్రభుత్వం చెల్లిస్తుంది. కాగా.. జిల్లాలో 320 గొర్రెల పెంపకం దార్ల సంఘాలు ఉండగా 31,857 మంది సభ్యులు ఉన్నారు. తొలివిడతలో 15,368 మందికి, రెండో విడతలో 1,377 మందికి గొర్రెలు పంపిణీ చేశారు. కాగా.. గండేడ్, మహమ్మదాబాద్ మండలాల పరిధిలోని వెన్నాచేడ్, కొండాపూర్, పెద్దవార్వాల్, మొకర్లాబాద్, కంచన్‌పల్లి, వెంకట్‌రెడ్డిపల్లి, దేశాయిపల్లి, చెలిమిల్ల, జిన్నారం, రుసుంపల్లి గ్రామాల్లో 1,153 మంది డీడీలు కడితే 114 మందికి గొర్రెలు వచ్చాయి. దీంతో మిగతా లబ్ధిదారులు అయోమయంలో పడ్డారు.

లబ్ధిదారుల ఎదురుచూపు..

సబ్సిడీ గొర్రెల పథకం పంపిణీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టింది. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొంది అధికారం చేపట్టడంతో గొర్రెల పంపిణీపై నీలినీడలు అలుముకున్నాయి. చాలామంది గొర్రుల పెంపకంతోనే జీవనోపాధి కొనసాగిస్తున్నారు. ఈ పథకం కింద లబ్ధిపొందేందుకు అప్పటల్లో కొందరు అప్పులు చేస్తే.. మరికొందరు గత్యంతరం లేక జీతాలు ఉండి డీడీలు కట్టారు. ఇప్పుడు గొర్రెల పంపిణీ పథకం అమలు ప్రశ్నార్థకంగా మారడంతో కనీసం డీడీలు కట్టిన డబ్బులు అయినా ఇప్పించాలని వేడుకుంటున్నారు. మరి కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో తెలియని పరిస్థితి నెలకొంది.

జిల్లాలో గొర్రెల పెంపకం దారుల సొసైటీలు **320**	సభ్యులు **31,857**
మొదటి విడత పంపిణీ చేసిన యూనిట్లు **15,368**	డీడీలు చెల్లించిన వారు **11,929** (రూ.52.19 కోట్లు)
రెండో విడతకు ఎంపిక చేసిన లబ్ధిదారులు **16,823**	గొర్రెల యూనిట్లు పొందిన వారు **1,377**
ఇంకా రావాల్సిన వారు **10,552** (చెల్లించిన డీడీల విలువ రూ. 46.16 కోట్లు)	

సిబ్బందికి వేధింపులు..

అప్పట్లో గొర్రెల పంపిణీకి లబ్ధిదారులను ఎంపిక చేయడంతోపాటు వాటికి సంబంధించిన డీడీలు కట్టడం. గొర్రెల కొనుగోలుకు తీసుకుపోయే వంటి కార్యక్రమాలు పశువైద్య సిబ్బందికి అప్పగించారు. వారే ముందుండి గొర్రెల పెంపకందార్లకు గొర్రెలు అందించే వరకు ముందున్నారు. గొర్రెలు వచ్చాక ఆయా మండలాల్లో ఎమ్మెల్యేలు, మంత్రులు, ఉన్నతాధికారులచే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇప్పుడు ఆ పథకం అమలుపై సందిగ్ధం నెలకొనడంతో డీడీలు కట్టిన లబ్ధిదారులు పశువైద్య సిబ్బంది వద్దకు తిరుగుతున్నారు. మా డబ్బులు ఇవ్వండి.. లేదంటే గొర్రెలు ఇవ్వాలని కోరుతుండటంతో సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు.

జీతం ఉండి కట్టాను



రెండేళ్లుగా జీతం ఉంటున్నా. జీతం ఉన్న డబ్బులతోనే గొర్రెల కోసం కట్టాను. నెల రోజుల్లో ఇస్తామని చెప్పారు. కానీ, ఎనిమిది నెలలవుతున్నా ఇప్పటికీ ఇవ్వలేదు. కనీసం గొర్రెలు ఇస్తే నన్న బతుకుదామనుకుంటే.. అతీగతీ లేదు. పశువైద్య సిబ్బందిని అడిగితే రేపు, మాపు అంటూ తిప్పుకొంటున్నారు.

– బూకలి రామచంద్రయ్య, వెన్నాచేడ్

వడ్డీకి అప్పు చేసి డీడీ తీశా..



జాబితాలో మొదటి పేరు నాదే ఉందంటే ఇక గొర్రెలు వస్తాయని వందకు మూడు రూపాయల చొప్పున వడ్డీకి అప్పు తెచ్చి డీడీ కట్టాను. ఏడాది గడిచినా ఇప్పటి వరకు గొర్రెలు ఇవ్వలేదు. ఎప్పుడు ఇస్తారో తెలియడం లేదు. అధికారుల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేదు. నా తర్వాత డీడీలు కట్టిన వారికి గొర్రెలు పంపిణీ చేసింద్రు.

– నడిల్ల రాజు, రామచంద్రాపూర్, మహబూబ్‌నగర్ రూరల్

గొర్రెలను పంపిణీ చేయాలి



సబ్సిడీ గొర్రెల కోసం నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్నాం. డీడీలు కట్టి ఏడాది గడిచింది. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా మా కష్టాలు చూసి డీడీలు కట్టిన వారికి వెంటనే గొర్రెలను పంపిణీ చేయాలి.

– నక్క రాజు, రామచంద్రాపూర్, మహబూబ్‌నగర్ రూరల్

వెంటబడి కట్టించాం..



టంకర ప్రాథమిక వెటర్నరీ సెంటర్ పరిధిలో 280 మంది గొర్రెల పెంపకం దార్లకు గాను 236 మంది డీడీ కట్టారు. వీరిలో 30 మందికి మాత్రమే గొర్రెల యూనిట్లు వచ్చాయి. అప్పట్లో వెంటబడి మరీ డీడీలు కట్టించాం. ఇప్పుడు గొర్రెలు రాకపోవడంతో ప్రతిరోజు లబ్ధిదారులు పశువైద్యశాల వద్దకు వస్తున్నారు. డబ్బులు అన్నా ఇవ్వండి.. లేదంటే గొర్రెలన్న ఇవ్వండి అంటూ ఒత్తిడి చేస్తుండటంతో ఏం చేయాలో పాలుపోవడం లేదు.

– హరిప్రసాద్, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్, టంకర, హన్వాడ మండలం

ఆందోళన చెందొద్దు



జిల్లాలో మొదటి విడత 15,368 యూనిట్లు పంపిణీ చేశాం. రెండో విడత 1377 గొర్రెల యూనిట్లను పంపిణీ చేశాం. మరో 10,522 మంది లబ్ధిదారులకు యూనిట్లు పంపిణీ చేయాల్సి ఉంది. వీరంతా డీడీలు చెల్లించారు. అయితే డబ్బుల గురించి ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. బయట జరిగే అసత్య ప్రచారాలను నమ్మి.. సిబ్బందిని వేధించొద్దు. ప్రభుత్వం ఆదేశిస్తే గొర్రెలను పంపిణీ చేస్తాం.

– మధుసూదన్‌గౌడ్, పశుసంవర్ధక శాఖ జేడీ

న్యూస్‌రీల్

ఉత్తీర్ణత శాతం మెరుగుపరచాలి



నవాబుపేట: జిల్లాలో పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత వంద శాతం సాధించేలా బోధన జరగాలని డీఈఓ రవీందర్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని ఇప్పటూర్, కారుకొండ, కూచూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలను పరిశీలించి పదో తరగతి విద్యార్థులకు బోధించిన సిలబస్‌పై ఆరాతీశారు. ఉత్తీర్ణత శాతం చాలా పెరగాలని వందశాతం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వం పేర్కొన్న విధంగా బోధన సమయం ప్రకారం సిలబస్ పూర్తిచేసి ముందుగానే రివిజన్ పూర్తి చేయాలని వివరించారు. గతంలో మండలంలో ఉత్తీర్ణత శాతం చాలా తక్కువగా ఉందని, ఈసారి మరింత మెరుగుపరిచేలా చూడాలన్నారు. ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వీడి బాధ్యతాయుతంగా బోధన చేయాలని, పాఠశాలల హెచ్‌ఎంలు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అనంతరం ఇప్పటూర్, రుక్కంపల్లి పాఠశాలలను సందర్శించారు. కార్పొరేట్ మాదిరిగా వాటిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను, గ్రామ విద్యా కమిటీలను ఆయన అభినందించారు. డీఈఓ వెంట హెచ్‌ఎం నర్సింహులు, సీఆర్‌పీ జనార్దన్ తదితరులున్నారు.

యువజనోత్సవాల్లో ఎంవీఎస్ విద్యార్థి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థి సాయికుమార్ మహారాష్ట్రలోని నాసిక్‌లో నాలుగు రోజులపాటు జరిగిన 27వ యువజనోత్సవాలు–2024లో పాల్గొన్నారు. ఉత్సవాల్లో పాల్గొన్న విద్యార్థిని గురువారం ప్రిన్సిపాల్ పద్మావతి, అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలను తెలుసుకునేందుకు యువజనోత్సవాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఈశ్వరయ్య, నాగరాజుచారి, సులేమాన్, ఆరిఫ్, రుక్సానా, భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'కూలిన నిర్మాణాలు-రక్షణ'పై అవగాహన

మహబూబ్‌నగర్ న్యూటౌన్: జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ ప్రాంగణంలో కూలిన నిర్మాణాలు– రక్షణ అనే అంశంపై మాదిరి ఎక్సర్‌సైజ్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రవినాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఢిల్లీలో జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఇలాంటి కార్యక్రమాలను రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నిర్వహిస్తుందని, ఇందులో భాగంగా షెడ్యూల్ ప్రకారం మహబూబ్‌నగర్‌లో శుక్రవారం మాక్ ఎక్సర్‌సైజ్‌తోపాటు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లాకేంద్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల అధికారులు, సిబ్బంది పాల్గొనాలని కోరారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుల నియామకం



శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, నాగర్‌కర్నూల్/పాలమూరు: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీజేపీ జిల్లా అధ్యక్షుల నియామకం చేపట్టింది. ఈ మేరకు గురువారం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అధ్యక్షుల నియామక ప్రకటన విడుదల చేశారు. ఇందులో మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడిగా పి.శ్రీనివాస్‌రెడ్డి, వనపర్తి జిల్లా అధ్యక్షుడిగా డి.నారాయణ, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడిగా ఎల్లేని సుధాకర్‌రావు, జోగుళాంబ గద్వాల జిల్లా అధ్యక్షుడిగా ఎస్.రామచంద్రారెడ్డి, నారాయణపేట జిల్లా అధ్యక్షుడిగా ఎం.జలేందర్‌రెడ్డిలను నియమించింది.

- మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడిగా నియామకమైన శ్రీనివాస్‌రెడ్డి 1990 నుంచి 2000 వరకు ఏబీవీపీ పట్టణ కార్యదర్శిగా, ప్రకాశం జిల్లా ఆర్గనైజర్ సెక్రటరీగా, ఆ తర్వాత రాజమండ్రి ఈస్ట్, వెస్ట్ ఆర్గనైజర్ సెక్రటరీగా పనిచేశారు. అనంతరం ప్రజా సంఘర్షణ సమితి జిల్లా కన్వీనర్‌గా కొనసాగారు. 2007 నుంచి 2015 వరకు పాలమూరు బీజేపీ జిల్లా కోశాధికారిగా, 2015 నుంచి 2024 వరకు జిల్లా ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపుపై విచారణ



దివిటిపల్లిలో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వద్ద విచారణ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

మహబూబ్‌నగర్ రూరల్: మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని దివిటిపల్లి శివారులో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపుపై విచారణ ప్రారంభమైంది. గతంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 1,024 డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు కేటాయించారు. ఈ విషయంలో అవకతవకలు జరిగాయని, ఆ ఇళ్ల కేటాయింపుపై విచారణ జరపాలని కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కలెక్టర్ రవినాయక్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న కలెక్టర్ వెంటనే ఐదు బృందాలను నియమించి విచారణకు ఆదేశించారు. అర్బన్ తహసీల్దార్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ఐదు బృందాలుగా ఏర్పడి దివిటిపల్లిలో లబ్ధిదారుల ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ, కరెంట్ బిల్లులతోపాటు తమకు కేటాయించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో లబ్ధిదారులు ఉంటున్నారా.. లేక తాళం వేసి ఉన్నాయా.. అనే వివరాలు తెలుసుకుంటున్నారు. సమగ్ర విచారణ తర్వాత ఇళ్ల కేటాయింపులోని అవకతవకలపై ఓ క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. దానిబట్టే తదుపరి చర్యలు ఉండవచ్చునని భావిస్తున్నారు.

మైనింగ్ అధికారుల తనిఖీలు



దేవరకద్ర: జిల్లా మైనింగ్ అధికారులు గురువారం దేవరకద్రలో తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని గూరకొండ రోడ్డులో అక్రమంగా నిల్వ చేసిన 20 ఎంఎం కంకరను జిల్లా మైనింగ్ ఏడీ విజయకుమార్ సీజ్ చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఏడీ తెలిపారు. అలాగే బస్వాపూర్ సమీపంలో ఉన్న క్రషర్‌ను పరిశీలించారు. ఆయన వెంట మైనింగ్ సర్వేయర్ సుజాత, రెవెన్యూ ఆర్ఐ సురేష్ తదితరులున్నారు.

బడుల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు

- స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికకు ఉత్తర్వులు జారీ
- ఈ నెల 20న నోటీసులు, 29న నిర్వహణ..
- 1- 8వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు పోటీచేసే అవకాశం



మహబూబ్‌నగర్ రూరల్ కేజీబీవీలో తరగతులు వింటున్న విద్యార్థినులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికల కోలాహలం నెలకొననుంది. పాఠశాలల్లో చేపట్టే అభివృద్ధి, ఇతరత్రా కార్యక్రమాలపై నిర్ణయాలు తీసుకునే ఎస్‌ఎంసీ (స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నికలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పాఠశాల స్థాయిలో ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లను 1- 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులను సభ్యులుగా చేతులెత్తి ఎన్నుకునే విధానం చేపట్టనున్నారు. చివరిసారిగా 2019 నవంబర్‌లో ఎస్‌ఎంసీ చైర్మన్ ఎన్నికలను ప్రభుత్వం నిర్వహించింది. ఈ క్రమంలో కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం మరోసారి ఎన్నికలు నిర్వహించేందు చర్యలు చేపడుతోంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 3,725 ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, 60కి పైగా వివిధ శాఖల పరిధిలోని రెసిడెన్సియల్, 65 కస్తూర్బా గాంధీ, మోడల్ స్కూల్స్, యూఆర్‌ఎస్, ఎయిడెడ్ పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది.

రేపటి నుంచే ప్రక్రియ..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ నెల 29న స్కూల్ కమిటీ ఎన్నికలను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభం కానుంది. మొదట పాఠశాల పరిధిలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నికల్లో పాల్గొనే విధంగా హెచ్‌ఎం శనివారం ఉదయం నోటీసు జారీ చేయాల్సి ఉంటుంది. అదేరోజు మధ్యాహ్నం విద్యార్థుల తల్లిదండ్రుల పేర్లను పాఠశాల ఆవరణలో ప్రదర్శించాలి. 22న ఎన్నికల్లో పాల్గొనే తల్లిదండ్రుల జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, 24న పోటీలో ఉన్నవారి తుది జాబితాను ప్రదర్శిస్తారు. 29వ తేదీన ఎన్నికలను ఉదయం 7 గంటల నుంచి ఒంటిగంట వరకు చేతులు ఎత్తే విధానంలో ఎన్నుకోవాల్సి ఉంటుంది. అనంతరం 2 గంటల నుంచి 4వరకు కొత్తగా ఏర్పడిన కమిటీతో సమావేశం నిర్వహించి, పాఠశాలలోని విషయాలు చర్చిస్తారు.

ప్రశాంత వాతావరణంలో..



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్‌ఎంసీ ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపడుతున్నాం. ప్రభుత్వ జీఓను పాఠశాలల ప్రధానోపాధ్యాయులు క్షుణ్ణంగా చదివి ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలి. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలి.

– రవీందర్, డీఈఓ, మహబూబ్‌నగర్

కాంగ్రెస్ 420 హామీలను ప్రజలకు గుర్తుచేయాలి

- పార్లమెంట్ సన్నాహక సమావేశంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన 420 హామీలను ప్రజలకు ఎప్పటికప్పుడు గుర్తుచేయాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ సన్నాహక సమావేశం నిర్వహించారు. పార్లమెట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. కలిసికట్టుగా ఉండి పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. మొన్నటి వరకు ప్రధాని నరేంద్రమోదీ, అదాని ఒక్కటేనని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ వేదికగా అదానితో అలయ్ బలయ్ చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ ఆదేశాల మేరకే రేవంత్‌రెడ్డి అదానితో కలిసి పనిచేస్తున్నారని ఆరోపించారు. ఆరు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడతారని జోస్యం చెప్పారు. రైతులకు రూ.2 లక్షలు ఒకేసారి మాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారని, దశలవారీగా చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి చెబుతున్నారని దుయ్యబట్టారు. ఎరువుల కోసం రైతులు క్యూలైన్‌లో నిలబడే రోజులు మళ్లీ వచ్చాయని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆస్తులను సృష్టించి.. బంగారు పళ్లెంలో పెట్టి తెలంగాణను కాంగ్రెస్‌కు అప్పగించిందన్నారు. బీఆర్‌ఎస్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, కడియం శ్రీహరి, మాజీ స్పీకర్లు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదనాచారి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుపడాలి

- స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్
- వీధి కుక్కల సంరక్షణ కేంద్రం పరిశీలన



మౌలాలిగుట్టలోని జంతువుల సంరక్షణ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగు పడాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ ఆదేశించారు. గురువారం ఉదయం స్థానిక రవీంద్రనగర్, రాంమందిర్‌చౌరస్తా, బండ్లగేరి తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికుల పనితీరుపై స్థానికులతో ఆరా తీశారు. ఎన్ని రోజులకు ఒకసారి చెత్తాచెదారం తొలగిస్తారని అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు రోడ్లను ఊడ్చి డ్రెయినేజీలను శుభ్రం చేయాలన్నారు. అన్ని వీధులను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. కాగా, ప్రస్తుతం 49 వార్డుల్లో మొత్తం 840 మంది పారిశుద్ధ్య కార్మికులకు గాను 423 మంది మాత్రమే ఉన్నారని మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్ బదులిచ్చారు. మధ్యాహ్నం మౌలాలిగుట్ట లోని జంతువుల సంరక్షణ కేంద్రాన్ని తనిఖీ చేశారు. వీధికుక్కలను పట్టుకుని ఇక్కడికి తరలించి వ్యాక్సినేషన్ చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈ బస్వరాజ్, ఏసీపీ జోత్స్న, టీపీఓ లక్ష్మీపతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గురులింగం, రవీందర్‌రెడ్డి, వాణికుమారి, హెల్త్ అసిస్టెంట్ వజ్రకుమార్‌రెడ్డి, ఏఈలు పృథ్వీ, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

గెలిచే వారికే బీజేపీ టికెట్



అయోధ్య రామ ప్రాణ ప్రతిష్ట ఆహ్వాన పత్రిక చూపిస్తున్న జితేందర్‌రెడ్డి

పాలమూరు: పార్లమెంట్ ఎన్నికల బరిలో తాను కూడా ఉన్నానని, బీజేపీ జాతీయ పార్టీ అని ఎక్కువ మంది టికెట్ ఆశించడం తప్పు లేదని, పార్టీ అన్ని రకాల సర్వేలు చేసుకుని గెలిచే సత్తా ఉండే అభ్యర్థులకు టికెట్ కేటాయిస్తుందని పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి అన్నారు. ఇప్పటికే తనకు టికెట్ కేటాయించాలని ఢిల్లీలో పార్టీ పెద్దలను కోరానన్నారు. జిల్లాకేంద్రంలోని పద్మావతి కాలనీలో ఆయన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం మధ్యాహ్నం 12.20 గంటలకు అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట జరుగుతున్న నేపథ్యంలో ఆ రోజు ప్రతి ఇంటిని శుద్ధి చేసుకుని ముగ్గులు వేసుకుని పూజలు చేసుకోవాలన్నారు. దీపావళి పండుగ మాదిరిగా ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించుకోవాలని సూచించారు. ఇలాంటి పుణ్య కార్యాన్ని చూడటానికి విదేశాల నుంచి చాలామంది ఆహ్వానితులు వస్తున్నట్లు చెప్పారు. బాలరాముడి ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని పాలమూరు ప్రజలు వీక్షించేలా క్లాక్‌టవర్ దగ్గర ప్రత్యేక ఎల్‌ఈడీ తెరలు ఏర్పాటు చేస్తున్నామని, దీంతోపాటు ప్రత్యేక హోమాలు నిర్వహిస్తామన్నారు. ప్రజల కోసం పనిచేసే మోదీ ఈ కార్యక్రమం కోసం 11రోజుల పాటు ఉపవాసం చేస్తున్నారని, ప్రపంచం మొత్తం అయోధ్య వైపు చూస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలయ్యేలా చూడాలని కోరారు. సమావేశంలో నాయకులు మిథున్‌రెడ్డి, బాలరాజు, కృష్ణవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

కందులు క్వింటాలు రూ.9,309

జడ్చర్ల/ దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం కందులకు క్వింటాలు గరిష్టంగా రూ.9,309, కనిష్టంగా రూ.8,936 ధర లభించింది. అలాగే వేరుశనగ క్వింటాలు గరిష్టంగా రూ.7,630, కనిష్టంగా రూ.4,208, ఆర్‌ఎన్‌ఆర్ రకం ధాన్యానికి క్వింటాలు గరిష్టంగా రూ.3,020, కనిష్టంగా రూ.2,966, హంస రకానికి రూ.2,010, మొక్కజొన్న గరిష్టంగా రూ.2,301, కనిష్టంగా రూ.2,259, రాగులు రూ.1,879 చొప్పున వచ్చాయి.

- దేవరకద్ర మార్కెట్ యార్డులో గురువారం జరిగిన టెండర్లలో కందులు క్వింటాల్‌కు గరిష్టంగా రూ.9,233, కనిష్టంగా రూ.9,163 ధరలు నమోదయ్యాయి.




సింగపట్నం లక్ష్మీనరసింహస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



రథంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహస్వామి

నమో.. నారసింహా



దేవతామూర్తులకు నమస్కరిస్తున్న బాలుడు

కనులపండువగా సింగపట్నం లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం

- వేలాదిగా తరలొచ్చిన భక్తజనం
- రథోత్సవంలో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు



స్వామివారి దర్శనానికి క్యూకట్టిన భక్తులు

కొల్లాపూర్/కొల్లాపూర్ రూరల్: సింగపట్నం లక్ష్మీ నరసింహస్వామి రథోత్సవం గురువారం కనుల పండువగా సాగింది. వేలాది భక్తజనం నడుమ స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ప్రధాన రహదారి వెంట ఊరేగించారు. ఈ సందర్భంగా నమో నారసింహా నామస్మరణ మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకుడు ఓరుగంటి సంపత్‌కుమార్‌శర్మ పర్యవేక్షణలో స్వామివారి రథోత్సవం శాస్త్రోక్తంగా, సంప్రదాయబద్ధంగా కొనసాగింది. సాయంత్రం ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలు, ఆభరణాలతో అలంకరించి, మంగళవాయిద్యాల నడుమ తేరుపైకి తీసుకొచ్చారు. ఆలయ ట్రస్ట్ రాజా బాలాదిత్య లక్ష్మారావు, ఆయన కుమారుడు సంప్రదాయబద్ధంగా మొదటి పూజ చేశారు. రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఆయన సతీమణి సృజన, తనయుడు జూపల్లి అరుణ్ ప్రత్యేక పూజలు నిర్వహించి, తేరు ఉత్సవాలను ప్రారంభించారు. చెంచులు తమ ఆచారం ప్రకారం నరసింహస్వామికి లాంచనాలు సమర్పించారు. సింగోటం గ్రామానికి చెందిన పలు కులాలవారు సంప్రదాయ పద్ధతిలో తమ వంశపారపర్య కైంకర్య సేవల్లో పాల్గొన్నారు. ప్రధాన ఆలయం నుంచి రత్నగిరికొండ వరకు భక్తులు స్వామివారి రథాన్ని లాగి పునీతులయ్యారు. శమీ వృక్షం వద్ద ప్రదక్షిణ అనంతరం ఆలయం వద్ద స్వామివారి రథం చేరింది. రథోత్సవాన్ని తిలకించేందుకు ఉమ్మడి పాలమూరుతో పాటు హైదరాబాద్, రాయలసీమ ప్రాంతం నుంచి భక్తులు భారీగా తరలొచ్చారు. ముందుగా లక్ష్మీనరసింహస్వామిని, రత్నగిరికొండపై కొలువుదీరిన రత్నలక్ష్మీదేవిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల ఏర్పాట్లను ఆలయ ఈఓ రంగారావు పర్యవేక్షించారు.

భక్తులతో కిక్కిరిసిన సింగపట్నం..

లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం సందర్భంగా సింగపట్నం భక్తులతో కిక్కిరిసింది. భక్తజనంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలొచ్చిన భక్తులు.. గుండంలో పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివారి దర్శనానికి క్యూకట్టారు. జాతరలో మిఠాయి, ఆటబొమ్మలు, గాజుల దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. జాతరలో దాతలు భక్తులకు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, కర్నూల్ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. జాతరలో ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఆలయానికి కిలోమీటర్ దూరంలో వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేశారు. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహించారు. రథోత్సవానికి దాదాపు లక్ష మంది వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు.

శ్రీవారి సముద్రంలో విహరించిన మంత్రి

సింగోటం శ్రీవారి సముద్రంలో టూరిజం శాఖ అధికారులు ఏర్పాటు చేసిన స్పీడ్ బోటులో మంత్రి జూపల్లి కృష్ణారావు విహరించారు. లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులు శ్రీవారి సముద్రం అందాలను తిలకించేందుకుగాను బోటు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంత్రి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.



శ్రీవారి సముద్రంలో విహరిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు



తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు



గుండంలో స్నానాలు చేస్తున్న భక్తులు

ఉమామహేశ్వరుడికి నందివాహన సేవ



నందివాహనంపై ఊరేగుతున్న ఉమామహేశ్వరుడు

- వైభవంగా సాగుతున్న బ్రహ్మోత్సవాలు
- భక్తులతో కిటకిటలాడిన కొండ

అచ్చంపేట: నల్లమల కొండలపై వెలసిన ఉమామహేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. పార్వతీ పరమేశ్వరుల దర్శనానికి గురువారం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. పాపనాశిని గుండం వద్ద పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివారి దర్శనానికి క్యూకట్టారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో ఉదయం గవ్యాంత పూజలు, అమ్మవారికి అభిషేకం, సహస్రనామార్చన, కుంకుమార్చన, రుద్రాభిషేకం, రుద్రహోమం, సాయంత్రం సాయమౌపాసన, శ్రీసూక్త, దుర్గాసూక్త హోమం, మృగయాత్ర వినోదం, నీరాజన మంత్రపుష్పం పూజా కార్యక్రమాలను వేద పండితులు వీరయ్యశాస్త్రి, నీరకంఠశాస్త్రిలు నిర్వహించారు. అనంతరం ఉమామహేశ్వరుడికి నందివాహన సేవ నిర్వహించగా.. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఆలయం నుంచి పాపనాశిని గుండం వరకు నందివాహనంలో ఊరేగించారు. వేద పడింతుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య ఉమామహేశ్వర స్వామి సంకీర్తనలు ఆలపించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్ కందూరు సుధాకర్, ఈఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అచ్చంపేట ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు.

పోలీస్ బందోబస్తు..

ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో సీఐ అనుదీప్, ఎస్‌ఐలు గోవర్ధన్, గురుస్వామి, శేఖర్‌గౌడ్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. దర్గా వద్ద స్వయంగా బందోబస్తును పరిశీలిస్తూ.. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఉమామహేశ్వరం కొండపైకి వాహనాలను అనుమతించడం లేదు. భోగమహేశ్వరం ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో, పంచాయతీరాజ్ అతిథిగృహం వద్ద పార్కింగ్ ఏర్పాటు చేశారు. రంగాపూర్, భోగమహేశ్వరం నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నారు. కొండపైకి భక్తులు బస్సులో వెళ్లే విధంగా చర్యలు చేపట్టారు.



ఉత్సవ మూర్తులకు పూజలు చేస్తున్న భక్తులు



భక్తులతో కిటకిటలాడుతున్న ఉమామహేశ్వర క్షేత్రం

రంగాపూర్ కిటకిట



దర్గాను దర్శించుకునేందుకు క్యూకట్టిన భక్తులు

- ప్రారంభమైన నిరంజన్‌షావలీ ఉర్సు
- భారీగా తరలొచ్చిన భక్తులు

అచ్చంపేట: మత సామరస్యానికి ప్రతీక అయిన రంగాపూర్ హజ్రత్ నిరంజన్‌షావలీ ఉత్సవాలు బుధవారం అర్ధరాత్రి తర్వాత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉర్సులో భాగంగా గురువారం గంధోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. గంధోత్సవాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలొచ్చారు. ముందుగా దర్గాను దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు భక్తులు కందూర్లు చేసి, దర్గాలో ఫాతేహాలు సమర్పించారు. ఉత్సవాలు వారం రోజులు పాటు నిర్వహించనున్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి, దర్గాను దర్శించుకోనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

ఉమామహేశ్వర క్షేత్రం సందర్శన..

అచ్చంపేట మండలంలోని రంగాపూర్‌కు 5 కిలోమీటర్ల దూరంలో కొండపై వెలసిన ఉమామహేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మూడు రోజుల కిందట ప్రారంభమయ్యాయి. రంగాపూర్ హజ్రత్ నిరంజన్ షావలీ దర్గాను సందర్శించే భక్తులు.. విధిగా ఉమామహేశ్వర స్వామిని దర్శించుకుంటారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఈరెండు ఉత్సవాలు ఒకేసారి ముగుస్తాయి.

నాటు బోటు నడిపితే కఠిన చర్యలు

పెంట్లవెల్లి: సింగోటం లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతి సంవత్సరం రాయలసీమ, కర్నూల్, నంద్యాల, నందికొట్కూరు ప్రాంతాల నుంచి వేలాదిగా మురువకొండ నుంచి కృష్ణానదిపై బోటు ప్రయాణంతో మంచాలకట్ట మీదుగా సింగోటం లక్ష్మీనరసింహ బ్రహ్మోత్సవాలకు వస్తుంటారు. అయితే 17 సంవత్సరాల కిందట జరిగిన సంఘటనను దృష్టిలో ఉంచుకుని, ఈ మధ్యకాలంలో నాటు బోట్లపై ప్రయాణించి నదుల్లో ప్రమాదవశాత్తు మృతిచెందారు. దీంతో రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల పోలీసులు నదిలో బోటు ప్రయాణాన్ని నిషేధించారు. అందుకు గాను గురువారం పెంట్లవెల్లి ఎస్‌ఐ మంచాలకట్ట గ్రామంలో ఉదయం పర్యటించి పోలీస్ సిబ్బందిని అక్కడ ఏర్పాటు చేశారు. ఎవరూ కృష్ణానదిపై అవతలికి, ఇవతలికి దాటవద్దని గాటు యజమాన్యానికి సూచించారు. ఒకవేళ దాటిస్తే బోటును సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని పెంట్లవెల్లి ఎస్‌ఐ సురేష్ హెచ్చరించారు.



మంచాలకట్ట వద్ద కృష్ణానదిని పరిశీలిస్తున్న ఎస్‌ఐ సురేష్

రాత్రివేళ ఇసుక అక్రమ రవాణా



రాజాపూర్ శివారులో మట్టిని తోడి ఫిల్టర్ ఇసుక తయారు చేసేందుకు ఏర్పాటు చేసిన డంప్

- ఎమ్మెల్యే ఆదేశాలతో ఇసుక మాఫియాపై కేసులు

రాజాపూర్: మండల శివారులో ఉన్న దుందుబీ వాగులో ఇసుక అక్రమ రవాణాపై ఇసుక మాఫియా రూటు మార్చారు. మొన్నటి వరకు అధికారులు, అధికార పార్టీ నాయకుల అండదండలతో పగలు, రాత్రి తేడా లేకుండ వాగులో మట్టిని తోడేసి, కృత్రిమ ఇసుకను తయారు చేసి పట్టణాలకు తరలించి సొమ్ము చేసుకునేవారు. కొత్తగా జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి విజయం సాధించిన వెంటనే ఇసుక అక్రమ రవాణాను కట్టుదిట్టం చేసేందుకు సొంత పార్టీ వారైన అక్రమ దందా కొనసాగిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు, రెవెన్యూ అధికారులకు తెలిపారు. దీంతో మండలంలో ఇసుక మాఫియా పగలు కృత్రిమ ఇసుకను దందాను బంద్ చేసి రాత్రి వేళల్లో కొనసాగిస్తున్నారు. రెండు రోజులక్రితం మండలంలోని చెన్నవెల్లిలో ఇసుక దందాకు అడ్డు వస్తున్నావ్ అంటూ గ్రామానికి చెందిన ఓ ఇంటిపైకి వెళ్లి దాడులు చేయడంతో ఐదుగురిపై కేసులు నమోదు అయ్యాయి.

ఇసుకంతా తోడేశారు..



మండలంలోని గ్రామాల శివారులో ఉన్న దుందుబీ వాగులో ఇప్పటికే ఇసుకను తోడేశారు. ఇప్పుడు మట్టిని తోడి ఫిల్టర్ ఇసుకను తయారు చేస్తున్నారు. దీంతో కొన్ని రోజులైతే సాగునీటి సంగతి దేవుడెరుగు తాగునీటికి కూడా ఇబ్బందులు పడాల్సి వస్తది. మండలంలో అసైన్డ్ భూముల వివరాలు కావాలని రెవెన్యూ అధికారులను కోరాం. గ్రామాల శివారుల్లో ఉన్న కుంటలు, చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయని వాటికి ఎఫ్‌టీఎల్ మార్కింగ్ ఇవ్వాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించాం. –అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల

అలసందల సాగు.. లాభాలు బాగు

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: రబీలో సాగు చేసే పంటల్లో అలసంద సాగు రైతులకు లాభసాటిగా ఉంటుంది. అలసంద సాగుకు అనువైన నేలల్లో పంట సాగు చేస్తే మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియా నాయక్ రైతులకు సూచించారు. ఈ పంటను ఫిబ్రవరి నుంచి నెల ఆఖరు వరకు విత్తుకోనే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. తేమను పట్టి ఉంచి మురుగుపోయే చల్కా, ఎర్రనేలల్లో సాగు చేయవచ్చని వ్యవసాయ శాఖ ఏడీఏ రైతులకు వివరిస్తున్నారు. రబీలో ప్రత్యామ్నా పంటగా అలసంద పంటను సాగు చేసుకుంటే మంచి దిగుబడితోపాటు లాభాలు పొందవచ్చని వివరిస్తున్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులు

అలసంద సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ శాఖ అధికారులు వివరిస్తున్నారు. ఎకరాకు 8 నుంచి 10 కిలోల విత్తనం కావాల్సి ఉంటుంది. పశుగ్రాసం లేదా పచ్చిరొట్టగా సాగు చేస్తే ఎకరాకు 12 నుంచి 14 విత్తనం అవసరం ఉంటుంది. కిలో విత్తనానికి 3 గ్రా థైరమ్ చొప్పున కలిపి తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలి. సాళ్ల మధ్యలో 30 సెం.మీ, మొక్కల మధ్య 10 సెం.మీ ఎడం ఉండేలా విత్తాలి. పంటకు ముందు ఆఖరి దుక్కిలో ఎకరాకు 2 టన్నుల మాగిన పశువుల ఎరువు, 18 కిలోల యూరియా, 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వేసి కలియ దున్నాలి.

కలుపు నివారణ..

పంట విత్తిన వెంటనే లేదా మరుసటి రోజు నేలలో తేమ ఉన్నప్పుడు 200 లీటర్ల నీటిలో 1.5 లీటర్ల పెండిమిథాలిన్ కలిపి ఎకరా విస్తీర్ణంలో పిచికారీ చేయాలి. అవసరాన్ని బట్టి సాళ్ల దంతెతో అంతర కృషి చేయాలి. ఈ పంటకు గొంగళి పురుగు, మారుక మచ్చ పురుల పురుగు, పచ్చదోమ, తెల్లదోమలతో పాటు బూడిద, పల్లాకు, ఆకు మచ్చ తెగుళ్ల ఆశించే అవకాశం ఉంది.



అలసంద పంట సాగు

పంట కోత :

పంట 45రోజుల దశలో పచ్చి కాయలు కోతకు వస్తాయి. మూడు రోజులకు ఒకసారి కాయలను కోయవచ్చు. ఎకరాకు 30 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. విత్తనం కోసం పండిస్తే 80 నుంచి 100 రోజులకు కాయలు సిద్ధం అవుతాయి. ఆకులు ఆకుపచ్చని రంగు నుంచి పసుపు రంగులోకి మారి రాలిపోతాయి. ఈ సమయంలో పంట కోత కోయవచ్చు.

విత్తన రకాలు :

జీసీ–3 : పంటకాలం 90–95 రోజులు. దిగుబడి ఎకరానికి 4 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడి ఉంటుంది. స్వల్పకాలికం. గుబురు రకం. పల్లాకు తెగులును తట్టుకుంటుంది. వీ–240 పంట కాలం 90–100 రోజులు. దిగుబడి ఎకరాకు 5–6 క్వింటాళ్లు ఉంటుంది. పశుగ్రాసానికి అనుకూలం. గింజలు ముదురు ఎరుపు రంగులో ఉంటాయి. సీ–152 రకం పంట కాలం 105 నుంచి 110 రోజులు. దిగుబడి ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్ల వరకు ఉంటుంది. అంతర పంటగా పండ్ల తోటలకు అనువైన రకం. గింజలు పెద్ద పరిమాణంలో తెలుపు రంగులో ఉంటాయి.

మూతబడిన ఆర్టీఓ, మార్కెట్ చెక్‌పోస్టులు



రాష్ట్ర సరిహద్దులో మూతపడ్డ ఆర్టీఓ చెక్‌పోస్టు

కృష్ణా: రాష్ట్ర సరిహద్దులోని ఆర్టీఓ, మార్కెట్ చెక్‌పోస్టులు బుధవారం నుంచి మూసివేశారు. కృష్ణా బ్రిడ్జి మరమ్మతుల కారణంగా కర్ణాటక నుంచి ఎలాంటి వాహనాలు రావడం లేదు. ఇటు నుంచి కూడా వాహనాలు వెళ్లేందుకు అవకాశం లేదు. ఈ 45 రోజుల పాటు ఆ కార్యాలయాలను మూసి ఉంచుతారు. అక్కడ ఎక్సైజ్ చెక్‌పోస్టు మాత్రం కొనసాగుతుంది. కర్ణాటక నుంచి కాలినడక బ్రిడ్జిపై ఇక్కడకు ప్రయాణికులు వస్తున్నారు. వారు ఏం తెస్తున్నారో తెలియనందున, వాటిని పరిశీలించేందుకు మాత్రం ఎక్సైజ్ చెక్‌పోస్టులో అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. మళ్లీ బ్రిడ్జిపై ప్రయాణాలు మొదలైన రోజున ఆర్టీఓ, మార్కెట్ చెక్‌పోస్టులు ప్రారంభమవుతాయి.

ఆకట్టుకున్న బలప్రదర్శన పోటీలు



గిరక పోటీల్లో సత్తా చాటుతున్న వృషబాలు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని వావిలాలలో శివాంజనేయస్వామి ఉత్సవాలు గురువారం వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా చివరిరోజు స్వామివారి జలక్రీడల కార్యక్రమాన్ని వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సేద్యపు ఎద్దుల బండ్ల గిరక పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన 36 జతల వృషబాలు పోటీల్లో పాల్గొని హోరాహోరీగా సత్తా చాటాయి. సందరాళ్లు, దొబ్బుడుగుండ్లు, గుబ్బలగుండు, ఇసుక సంచి ఎత్తు పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి 20మంది పోటీదారులు పాల్గొన్నారు. ఆయా పోటీలు బలప్రదర్శనల నడుమ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ఆలయ కమిటీ సభ్యులు బహుమతులు ప్రదానం చేశారు.



బలప్రదర్శనలో ఇసుక సంచిని ఎత్తిన వ్యక్తి



సందెరాయిని ఎత్తుతున్న యువకుడు



గుబ్బల గుండును ఎత్తిన యువకుడు

బాబు తోడుదొంగ ఈశ్వరన్ ఔట్

పదవులు, పార్టీకి సింగపూర్ మంత్రి రాజీనామా.. తీవ్ర అభియోగాలతో చార్జ్‌షీట్లు దాఖలు

సాక్షి, అమరావతి: రాజధాని అమరావతి పేరిట ఏపీ మాజీ సీఎం చంద్రబాబు సాగించిన భూ దోపిడీలో కీలక పాత్రధారిగా వ్యవహరించిన సింగపూర్ మాజీ మంత్రి ఎస్.ఈశ్వరన్ కథ ముగిసింది. రవాణా శాఖ మంత్రి పదవితోపాటు ఎంపీ సభ్యత్వానికి, సింగపూర్ అధికార పీపుల్స్ యాక్షన్ పార్టీ(పీఏపీ) ప్రాథమిక సభ్యత్వానికి ఆయన రాజీనామా చేసి ఇంటిదారి పట్టారు. ఆయన ఈ నెల 12న రాజీనామా చేసిన విషయం గురువారం వెలుగులోకి వచ్చింది. ఇక దర్యాప్తు ప్రక్రియ ముగిసి నేరాలు రుజువు కావడమే తరువాయి ఆయన జైలు పక్షిగా మారనున్నట్లు స్పష్టమైంది. సింగపూర్ ఫార్ములా వన్ రేసింగ్ కాంట్రాక్టులో ఈశ్వరన్ అక్రమాలకు తెగబడి ఏకంగా 2.98 లక్షల అమెరికన్ డాలర్ల మేర భారీ అవినీతికి పాల్పడినట్టు సింగపూర్ అవినీతి నిరోధక విభాగం 'కరప్ట్ ప్రాక్టీసెస్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో' (సీపీఐబీ) నిగ్గు తేల్చింది. 27 అభియోగాలతో తాజాగా చార్జ్‌షీట్లు దాఖలు చేసింది. వాటిలో ఆయన మంత్రి హోదాలో భారీ ముడుపులు తీసుకున్నట్టు 24 అభియోగాలు, అవినీతికి కేంద్ర బిందువుగా ఉన్నారని రెండు అభియోగాలు, న్యాయ విచారణకు అడ్డంకులు కల్పించారని ఒక అభియోగం ఉండటం ప్రాధాన్యం సంతరించుకుంది. నేరం రుజువైతే ఈశ్వరన్‌కు లక్ష డాలర్ల జరిమానాతోపాటు కనీసం ఏడేళ్ల జైలు శిక్ష పడుతుందని సింగపూర్ న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ఈశ్వరన్ వ్యవహారం టీడీపీలో గుబులు పుట్టిస్తోంది. స్కిల్ స్కామ్ కేసులో అరెస్టై 52 రోజులు రిమాండ్ ఖైదీగా గడిపి బెయిల్‌పై విడుదలైన చంద్రబాబు తాజా పరిణామాలతో ఆందోళన చెందుతున్నట్లు స్పష్టమవుతోంది.

కాకినాడలో భారీ ఎల్‌ఎన్‌జీ ఫ్లోటింగ్ టెర్మినల్

సాక్షి, అమరావతి: నార్వేకు చెందిన క్రౌన్ ఎల్‌ఎన్‌జీ ఏపీలో భారీ పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చింది. కాకినాడ వద్ద సముద్రంలో రూ.8,300 కోట్లతో ఫ్లోటింగ్ లిక్విఫైడ్ న్యాచురల్ గ్యాస్ టెర్మినల్‌ను అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించింది. ఎల్‌ఎన్‌జీని దిగుమతి చేసుకుని దానిని రీగ్యాసిఫికేషన్ చేసి దేశంలోని అన్ని ప్రాంతాలకు సరఫరా చేసే విధంగా 7.2 మిలియన్ టన్నుల సామర్థ్యంతో ఈ టెర్మినల్‌ను అభివృద్ధి చేయనున్నట్లు క్రౌన్ ఎల్‌ఎన్‌జీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ స్వపన్ కటారియా ప్రకటించారు.



సామాజిక న్యాయ శిల్పం.. నేడు జాతికి అంకితం

- అంబేడ్కర్ స్మృతివనం పనులు పూర్తి
- ఏపీ సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా నేడు ఆవిష్కరణ

సాక్షి ప్రతినిధి, విజయవాడ: స్వాతంత్య్రోద్యమంలో ఎన్నో చారిత్రక సమావేశాలకు వేదికగా నిలిచిన బెజవాడ స్వరాజ్య మైదానంలో నిర్మిస్తున్న భారతరత్న బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం పనులు పూర్తిచేసుకుని ప్రారంభానికి సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. చరిత్రలో నిలిచిపోయేలా రూపుదిద్దుకున్న సామాజిక న్యాయ మహాశిల్పం జాతికి అంకితమిచ్చే తరుణం వచ్చేసింది. అద్భుతమైన ప్రాజెక్టుగా రూపుదిద్దుకున్న ఈ స్మృతివనం పనులను మహాయజ్ఞంలా పూర్తిచేశారు. అత్యంత అందంగా తీర్చిదిద్దుతున్న ఈ ప్రాంగణం ప్రపంచస్థాయి పర్యాటకులను సైతం ఆకర్షించే వేదికగా మారనుంది. దేశంలో మతాతీతమైన విగ్రహాల్లో ఇదే అతిపెద్దది కావడం విశేషం. 206 (81 అడుగుల బేస్, 125 అడుగుల విగ్రహం) అడుగుల భారీ అంబేడ్కర్ విగ్రహం నగరానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. రాత్రివేళ ప్రత్యేక కాంతులతో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలుస్తోంది. ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా ఈ ప్రాజెక్టును పర్యవేక్షించి, అత్యంత అద్భుతంగా రూపొందించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

నిత్యం అధికారులతో మాట్లాడుతూ పనులు పరుగులు పెట్టించారు. ఇలా స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ (సామాజిక న్యాయ మహా శిల్పం)ను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దారు. ఈ అరుదైన అంబేడ్కర్ సామాజిక న్యాయ విగ్రహాదే ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరిస్తున్నారు. ఇక స్మృతివనాన్ని వీక్షించేందుకు ఈ నెల 20 నుంచి సామాన్య ప్రజలకు ప్రవేశం కల్పించనున్నారు.

పల్లెల్లో 'ప్రత్యేక'మే!

▶ మొదటి పేజీ తరువాయి

రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు గతంలో 'ట్రిపుల్ టెస్ట్' పేరిట మార్గదర్శకాలు ఇచ్చింది. స్థానిక సంస్థల పరిధిలో ఆయా గ్రూపుల వెనుకబాటు స్వభావంపై బీసీ కమిషన్ ద్వారా విచారణ జరపాలని.. ఆయా చోట్ల ఏ నిష్పత్తిలో రిజర్వేషన్లు ఇవ్వాలనేది తేల్చాలని సూచించింది. మొత్తంగా రిజర్వేషన్లు (ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కలిపి) 50 శాతం మించకుండా ఉండాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపు, మార్పుల కోసం బీసీ కమిషన్ విచారణ జరిపి నివేదిక ఇవ్వాల్సి ఉంది. దాని ఆధారంగానే పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లను పెంచేందుకు వీలు కానుంది.

ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూపులు!

చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ ఆధ్వర్యంలోని రాష్ట్ర బీసీ కమిషన్.. 'ట్రిపుల్ టెస్ట్' అంశంలో అనుసరించిన విధానాలపై ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో క్షేత్రస్థాయి పర్యటనలు పూర్తిచేసినట్టు సమాచారం. ప్రభుత్వానికి నివేదిక సమర్పించే విషయంలో కమిషన్‌కు పూర్తి స్పష్టత లేక ఆచితూచి వ్యవహరిస్తున్నట్టు తెలిసింది. కొత్త ఓటర్ల జాబితా వచ్చాక.. దాని ఆధారంగా మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలను నోడల్ ఏజెన్సీలుగా పెట్టి ఆ వివరాలు సేకరించి ఇవ్వాలని భావిస్తున్నట్టు బీసీ కమిషన్ వర్గాలు చెప్తున్నాయి. అయితే ఓటర్ల జాబితా ద్వారానా? లేక సామాజిక, ఆర్థిక, కుల సర్వే ఆధారంగా వెళ్లాలా అన్న దానిపై ప్రభుత్వపరంగా ఎలాంటి సంకేతాలు రాకపోవడంతో సందిగ్ధత ఏర్పడినట్టు సమాచారం. లోక్‌సభ ఎన్నికలు ముగిశాక పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని, ఆలోగా బీసీ కమిషన్ నివేదిక ప్రక్రియ పూర్తవుతుందని రాష్ట్ర సర్కారు భావిస్తున్నట్టు తెలిసింది.

మొత్తం 12,751 పంచాయతీలు..

రాష్ట్రంలో ప్రస్తుతం 12,751 గ్రామ పంచాయతీలకు (కొత్తగా ఏర్పాటు చేసినవి కలిపితే మొత్తం 12,772 పంచాయతీలు) సర్పంచ్‌లు ఉన్నారు. వార్డు సభ్యులు సుమారు లక్షా 27 వేల మంది వరకు ఉంటారు. తెలంగాణ నూతన పంచాయతీరాజ్ చట్టం–2018 ప్రకారం.. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిపోయాక పర్సన్ ఇన్‌చార్జులుగా నియమించే అవకాశం లేదు. దీనితోపాటు సకాలంలో ఎన్నికలు జరగకపోతే గ్రామ పంచాయతీలకు 'స్పెషల్ ఆఫీసర్'లను నియమించాల్సి ఉంటుంది.

- ఉమ్మడి ఏపీలో కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు.. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో 2011–2013 మధ్య పంచాయతీలు స్పెషల్ ఆఫీసర్ల పాలనలో కొనసాగాయి. అంతకుముందు చంద్రబాబు సర్కారు హయాంలోనూ గడువులోగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించని కారణంగా, అంతకుముందున్న సర్పంచ్‌లనే పర్సన్ ఇన్‌చార్జులుగా కొనసాగించారు.

రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రతిపాదనలు పంపినా..!

రాజ్యాంగం ప్రకారం పంచాయతీరాజ్ సంస్థల ఐదేళ్ల పదవీకాలం ముగిసేలోపే.. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం పదవీకాలం ముగియడానికి మూడు నెలల ముందే ఎన్నికలు పూర్తిచేయాలి. ఈ క్రమంలో రాష్ట్రంలో జనవరి లేదా ఫిబ్రవరిలో మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని, అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ప్రభుత్వానికి గతంలోనే ప్రతిపాదనలు పంపినట్టు తెలిసింది. కానీ దీనిపై గత ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. త్వరలో లోక్‌సభ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో.. కనీసం ఆరు నెలల వరకు పంచాయతీ ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేదు. దీంతో అప్పటివరకు స్పెషలాఫీసర్ల పాలనలో కొనసాగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మొగ్గుచూపుతున్నట్టు తెలిసింది.

ప్రస్తుత సర్పంచ్‌లనే ఇన్‌చార్జులుగా కొనసాగించాలి

''ప్రస్తుతమున్న సర్పంచ్‌లనే పర్సన్ ఇన్‌చార్జులుగా కొనసాగించాలి. దీనిపై ఇప్పటికే ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించాం. గ్రామాల అభివృద్ధిపై మాకు పూర్తి అవగాహన ఉన్నందున ప్రభుత్వ కార్యక్రమాల అమల్లో, పాలనలో జాప్యం జరగదు. స్పెషలాఫీసర్లకు గ్రామాల్లోని పరిస్థితులపై అవగాహన ఏర్పడేందుకే కొంత సమయం పడుతుంది. అధికారులు స్థానికంగా ఉండరు, ఆఫీస్ టైమ్ బట్టి వచ్చి వెళ్తుంటారు. మేం గ్రామాల్లోనే అందుబాటులో ఉంటాం. ఆరునెలల పాటు ఇన్‌చార్జులుగా పొడిగించాలి. కోవిడ్ మహమ్మారి కారణంగా దాదాపు మూడేళ్ల పదవీకాలాన్ని కోల్పోయాం. మాకు చెక్ పవర్ కూడా ఆరు నెలలు ఆలస్యంగా ఇచ్చారు. గతంలో చేసిన పనులకు ఇంకా బిల్లులు రావాల్సి ఉంది.

– ఉప్పుల అంజనీప్రసాద్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం గౌరవాధ్యక్షుడు

స్పెషలాఫీసర్లతో పాలనకు ఇబ్బంది

''ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రస్తుత సర్పంచ్‌లకే పర్సన్ ఇన్‌చార్జులుగా బాధ్యతలు అప్పగిస్తే బాగుంటుంది. గతంలో పనిచేసిన అనుభవం, విధుల నిర్వహణకు పనికొస్తుంది. క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి దోహదపడతారు. వెంటనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించే అవకాశం లేదు కాబట్టి సర్పంచ్‌లనే మరో ఆరునెలల పాటు కొనసాగిస్తే గ్రామాల్లో మంచి ఫలితాలు వచ్చే అవకాశముంది. పరిపాలన ఇబ్బందులు లేకుండా సజావుగా సాగే అవకాశాలు ఉంటాయి. అదే స్పెషల్ ఆఫీసర్‌గా నియమితులైన వారికి గ్రామంపై పట్టు రావడానికి.. ఆయా సమస్యలు, అంశాలపై అవగాహన ఏర్పడడానికి సమయం పడుతుంది.

– చింపుల సత్యనారాయణరెడ్డి, పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు

చరిత్ర ఎరుగని సాహసం

ఏకంగా 31.19 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలు: ఏపీ సీఎం జగన్



నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్ చెక్కును అందజేస్తున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా దేశ చరిత్రలో ఎప్పుడూ జరగని విధంగా, ఎవరూ సాహసించని రీతిలో అక్కచెల్లెమ్మలకు ఏకంగా 31.19 లక్షల ఇళ్ల స్థలాలు ఇవ్వగలిగామని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. ఇంటి స్థలం, ఇల్లు రూపంలో ప్రతి నిరుపేద అక్కచెల్లెమ్మకు రూ.20 లక్షల వరకు విలువైన ఆస్తిని ఇవ్వగలిగే గొప్ప అవకాశాన్ని దేవుడు తనకు ఇచ్చినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకం కింద 4,07,323 మంది లబ్ధిదారులకు బ్యాంకు రుణాలపై వడ్డీని రీయింబర్స్ చేస్తూ రూ.46.90 కోట్ల మొత్తాన్ని సీఎం జగన్ బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారు. గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారులను ఉద్దేశించి సీఎం జగన్ మాట్లాడారు. ''రాష్ట్రంలో ఇప్పటికే 22.25 లక్షల ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. రాష్ట్ర చరిత్రలో ఇది ఎక్కడా, ఎప్పుడూ చూడని విధంగా చేపడుతున్నాం. ఒక్కో ఇంటి నిర్మాణానికి దాదాపు రూ.2.70 లక్షలు ఖర్చవుతుంది. మరో రూ.లక్ష మౌలిక సదుపాయాల కోసం అదనంగా ఖర్చవుతుంది. ఇంటి నిర్మాణం, మౌలిక వసతుల కోసం దాదాపు రూ.3.70 లక్షలు ఖర్చు అవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో రూ.1.80 లక్షలు నేరుగా అక్కచెల్లెమ్మలకు ఇస్తున్నాం. మరో రూ.35 వేలు పావలా వడ్డీకి రుణాలను అందుబాటులోకి తెచ్చాం. దాదాపు రూ.15 వేలు ఖరీదు చేసే ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తున్నాం. సిమెంట్, మెటల్ ఫ్రేమ్స్ లాంటి వివిధ రకాల నాణ్యమైన వస్తువులను మార్కెట్ ధర కన్నా తక్కువకు సబ్సిడీపై అందించడం ద్వారా రూ.40 వేల దాకా ప్రయోజనం చేకూరుస్తున్నాం. మనం ఇచ్చిన ఇంటి స్థలం మార్కెట్ విలువ ప్రాంతాన్ని బట్టి కొన్ని జిల్లాల్లో రూ.15 లక్షల పైచిలుకు ఉంది. ఈ విలువ మీద ఇళ్లు, మౌలిక సదుపాయాల విలువలను కలిపితే ప్రతి అక్కచెల్లెమ్మకు రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకూ ఆస్తిని తోబుట్టువుగా సమకూరుస్తున్నాం'' అని చెప్పారు.

సిరిసిల్లలో సాంచాల బంద్ ఉపసంహరణ

- మొదలైన వస్త్రోత్పత్తి

సిరిసిల్ల: సిరిసిల్లలో రెండురోజులుగా బంద్ పడిన మరమగ్గాలు మళ్లీ వస్త్రోత్పత్తిని ప్రారంభించాయి. స్థానిక పాలిస్టర్ అసోసియేషన్ భవన్‌లో గురువారం సమావేశమైన వస్త్రోత్పత్తిదారులు ఆసాములు, కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని వస్త్రపరిశ్రమ బంద్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు మండల సత్యం, కార్యదర్శి వెల్దండి దేవదాస్, ఉపాధ్యక్షుడు బూట్ల నవీన్ తెలిపారు. సిరిసిల్లలో సాంచాల బంద్ కారణంగా వస్త్రోత్పత్తి నిలిచిపోవడంతో కార్ఖానాల్లోని కార్మికులకు ఉపాధి కరువైంది. ప్రభుత్వ పెద్దలు సైతం పరిశ్రమను బంద్ చేయొద్దని చెప్పడం, సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వస్త్రోత్పత్తిని తిరిగి ప్రారంభిస్తున్నామని వారు వెల్లడించారు. బంద్ ఉపసంహరణ తో గురువారం సాయంత్రమే ఆసాములు వస్త్రోత్పత్తిని ప్రారంభించారు.

బైక్‌ను ఢీకొట్టిన బొలెరో: వ్యక్తి మృతి



రాజేందర్(ఫైల్)

చిన్నంబావి: మండలంలోని వెలగొండ సమీపంలో బొలెరో, బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. దగడపల్లికి చెందిన బక్కి రాజేందర్(40) గురువారం తన వ్యక్తిగత పనుల నిమిత్తం స్వగ్రామం నుంచి వెలగొండకు వెళ్తున్నాడు. మార్గమధ్యంలో పెబ్బేరు నుంచి వస్తున్న బొలెరో వాహనం బైక్‌ను ఢీకొట్టడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు అంబులెన్స్‌లో వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అతడికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతామని ఎస్.ఓ బుల్‌రెడ్డి తెలియజేశారు.

అదుపుతప్పి పొట్టు ట్రాక్టర్ బోల్తా

- నలుగురికి తీవ్ర గాయాలు



జాతీయ రహదారిపై బోల్తాపడ్డ పొట్టు ట్రాక్టర్

ఎర్రవల్లిచౌరస్తా: జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు పొట్టు లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడటంతో నలుగురికి గాయాలైన ఘటన గురువారం చోటు చేసుకుంది. ఇటిక్యాల పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. ధర్మవరం చెందిన రవి తన ట్రాక్టర్‌లో గ్రామానికి చెందిన ఆరుగురితో కలిసి పెబ్బేర్ వైపు నుంచి వేరుశనగ పొట్టును లోడ్ చేసుకొని తిరిగి స్వగ్రామానికి బయలు దేరారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై జింకలపల్లి స్టేజీలో వెళ్తుండగా ట్రాక్టర్ ప్రమాదవశాత్తు అదుపుతప్పి ఒక్కసారిగా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పొట్టు లోడ్‌పై ఉన్న గోకారి, బోయ మధు, సత్యన్న, ఈడిగ మధుకు తీవ్ర గాయాలయ్యాయి. ఇంజన్‌పై ఉన్న డ్రైవర్ రవి, బాబు, కల్యాణ్ తేలిక పాటి గాయాలతో బయటపడ్డారు. గమనించిన స్థానికులు వారిని చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ట్రాక్టర్ రోడ్డుపై పడటంతో ఒక్కసారిగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు, హైవే సిబ్బంది క్రేన్ ద్వారా ట్రాక్టర్‌ను తొలగించి వాహనాలను పంపించారు.

రాష్ట్రానికి క్రిటికల్ కేర్ బ్లాక్‌లు



బాదేపల్లి ఏరియా ఆస్పత్రి భవనం-ఇదే భవనంలో సీసీబీ ఏర్పాటు కానుంది

పదిరోజుల్లో పనులు ప్రారంభం..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు ఆయుష్మాన్ భారత్ మిషన్‌లో భాగంగా మహబూబ్‌నగర్ (బాదేపల్లి), నారాయణపేట, నాగర్‌కర్నూలు, జోగుళాంబ గద్వాల నాలుగు క్రిటికల్ కేర్ బ్లాక్‌లు మంజూరయ్యాయి. వాటిలో నారాయణపేటలో ప్రస్తుత ఆస్పత్రిపైనే సీసీబీ ఏర్పాటుకు పనులు ప్రారంభించాం. మిగిలిన మూడు సీసీబీలకు టెండరు ప్రక్రియ కొనసాగుతోంది. పదిరోజుల్లో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– జైపాల్‌రెడ్డి, ఈఈ, తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్

- ఉమ్మడి జిల్లాకు నాలుగు, రాష్ట్రానికి 20 సీసీబీలు
- నారాయణపేటలో పనులు ప్రారంభం
- బాదేపల్లి, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్‌లో పదిరోజుల్లో పనులు

జడ్చర్ల టౌన్: ప్రధాన మంత్రి ఆయుష్మాన్‌భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ మిషన్‌లో భాగంగా ఉమ్మడి తెలంగాణ రాష్ట్రానికి 20 క్రిటికల్ కేర్‌బ్లాక్‌లు మంజూరు కాగా వాటిలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు నాలుగు కేటాయించారు. ఉమ్మడి జిల్లాకు మంజూరైన వాటిలో మహబూబ్‌నగర్ (బాదేపల్లి), నారాయణపేట, జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూలు కేంద్రాలున్నాయి. ఒక్కో సీసీబీకి రూ.23.75 కోట్ల చొప్పున మొత్తం రూ.90కోట్లు మంజూరయ్యాయి. నాలుగింటిలో నారాయణపేట జిల్లాలో మాత్రమే పనులు ప్రారంభం కాగా, మిగిలిన మూడు సీసీబీలు టెండరు ప్రక్రియలో ఉన్నాయి. మరో పదిరోజుల్లో ప్రక్రియ పూర్తై పనులు ప్రారంభం కానున్నట్లు అధికారులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్‌భూపాలపల్లి, జోగుళాంబ గద్వాల్, హైదరాబాద్, ఖమ్మ, కొముర౦భీం ఆసీఫాబాద్, మంచిర్యాల, మహబూబ్‌నగర్(బాదేపల్లి), ములుగు, నాగర్‌కర్నూలు, నల్గొండ, నారాయణపేట, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి (మహేశ్వరం), వికారాబాద్, సూర్యపేట, పెద్దపల్లి, వికారాబాద్, వరంగల్ (నర్సంపేట) నారాయణపేటలకు క్రిటికల్ కేర్ బ్లాక్‌లు మంజూరయ్యాయి. ఈ మేరకు గతేడాది అక్టోబర్ 3న నిజామాబాద్‌లో జరిగిన సభలో ప్రధాని మోడీ సీసీబీల పనులకు శంకుస్థాపన చేశారు.

ఇవీ ప్రయోజనాలు..

ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో ఉన్న ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రులలో సీసీబీలు ఏర్పాటు చేసేలా ప్రతిపాదించారు. తద్వారా వైద్యులు, సిబ్బంది పెరగటంతో వైద్య సేవలు మెరుగుపడనున్నాయి. ముఖ్యంగా ప్రమాదాలు జరిగినప్పుడు, అత్యవసర సేవలు అందించటంలో సీసీబీలు కీలకం కానున్నాయి. ఇక గుండెపోటు, పక్షవాతం, పాముకాటు, క్షణికావేశంలో బలవన్మరణానికి పాల్పడే వారికి రాత్రిళ్లు అత్యవసర సేవలు అవసరం అవుతాయి. సీసీబీలో నిష్ణాతులైన వైద్యులు 24గంటలు అందుబాటులో ఉండటం వల్ల పైవాటికి సత్వర చికిత్స అందించే వీలవుతుంది. సీసీబీల్లో ఐసోలేషన్ వార్డులు ఏర్పాటు చేస్తున్నారు. ఆక్సిజన్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చేస్తారు. ఎలాంటి ఇన్‌ఫెక్షన్‌లు అయినా రాకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకునేలా చికిత్స అందించనున్నారు. ఆస్పత్రుల్లో ఉన్న రెఫరల్ బాధలు సైతం తగ్గుతాయి.

జాతీయ రహదారులతో ప్రయోజనం..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నాలుగు సీసీబీలు మంజూరు కాగా వాటిలో బాదేపల్లి సీసీబీ వల్ల అనేక ప్రయోజనాలున్నాయి. 44వ నెంబరు, 167వ నెంబరు జాతీయ రహదారులు ఈ ప్రాంతం గుండా పోతుండటంతో ప్రమాదాల బారిన పడిన వారికి అత్యవసర చికిత్స అందుబాటులోకి వస్తుంది. ఒక్కో సీసీబీకి రూ.23.75కోట్లు మంజూరు కాగా, వీటిలో సివిల్ పనులు అంటే భవన నిర్మాణం కోసం రూ.12.60 కోట్లు కేటాయించారు. మిగిలిన నిధులు మిషనరి, వసతి సౌకర్యాల కోసం వెచ్చించనున్నారు.

నారాయణపేటలో పనులు షురూ..

నారాయణపేటలో ఇటీవల పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుత జిల్లా ఆస్పత్రి భవనంలోనే సీసీబీ ఏర్పాటు చేస్తున్నారు. ఈ కారణంగా త్వరగా పనులు ప్రారంభమయ్యాయి. బాదేపల్లి (మహబూబ్‌నగర్) గంగాపురం రోడ్‌లోని నూతన ఆస్పత్రి భవనంలోనే సీసీబీని ప్రారంభించనున్నారు. ఈ మేరకు నిర్మాణ పనులకోసం టెండరు ప్రక్రియ కొనసాగుతోంది. టెండరు ప్రక్రియ పదిరోజుల్లో పూర్తి చేసి పనులు ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నాగర్‌కర్నూలు, జోగుళాంబ గద్వాల సీసీబీలు సైతం టెండరు ప్రక్రియలోనే ఉన్నాయి.



సాఫ్ట్‌బాల్ పోటీల్లో రెండోస్థానం

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి (అండర్-14) సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి పాలమూరు జిల్లా బాలికల జట్టు రెండో స్థానం సాధించింది. – మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ

రెండు ఎంపీ స్థానాలు గెలిపించుకోవాలి



మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

- 'మై బూత్ 10యూత్' సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం
- 20 వేల మంది చురుకైన కార్యకర్తలను గుర్తిస్తాం
- సంక్షేమ ఫలాలు ప్రతి గ్రామానికి అందేలా పనిచేయాలి
- చల్లా వంశీచంద్‌రెడ్డి

పాలమూరు: ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్ అవినీతి, అక్రమాలపై ఎలా పోరాటం చేశామో.. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి గ్రామానికి తీసుకెళ్లడానికి ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో పాటు సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌లకు ఎన్నికల కార్యాచరణపై సన్నాహక సమావేశం ఏర్పాటు చేసి, దిశానిర్దేశం చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో మొదటిసారిగా మహబూబ్‌నగర్‌ను పైలెట్ ప్రాజెక్టు కింద ఈ సమావేశాలు ఇక్కడే ప్రారంభించుకున్నామని, మరో పది రోజుల్లో నియోజకవర్గ స్థాయి సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సారి ఎన్నికల కోసం కొత్తగా 'మై బూత్ 10యూత్' అనే సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ప్రతి బూత్ పరిధిలో పది మంది చురుకైన కాంగ్రెస్ కార్యకర్తలను గుర్తించి, మై బూత్ 10యూత్ కార్యక్రమ నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తామన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో మొత్తం 1900 బూత్ పరిధిలో 20 వేల మంది కార్యకర్తలను ఇందుకోసం గుర్తిస్తామన్నారు. ప్రతి నియోజకవర్గంలో బైక్ ర్యాలీలు, ఇతర కార్యక్రమాలు చేపడుతామని, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి పని చేస్తామన్నారు. సీఎం సొంత జిల్లాలో రెండు స్థానాలు గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన అధ్యక్షుడు శివసేనారెడ్డి, సతీష్, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

మూడు ఇళ్లలో చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: ఒకేరోజు ముగ్గురి ఇళ్లలో చోరీ చేసిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ మహేందర్ వివరాల ప్రకారం మండలంలోని గగ్గలపల్లికి చెందిన పరిగి రామకృష్ణారెడ్డి ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లాడు. అదేవిధంగా చికొండ్రనాగమ్మ, చికొండ్రబాలమ్మలు రంగాపూర్ జాతరకు వెళ్లారు. బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తుల వారి ఇంటి తాళాలను విరగొట్టి బంగారు, వెండి, నగదును ఎత్తుకెళ్లారు. రామకృష్ణారెడ్డి ఇంటిలో 12 తులాల బంగారం, 25 తులాల వెండి, రూ.1.20లక్షల నగదు చోరీ చేశారు. చికొండ్ర నాగమ్మ ఇంట్లో 10 తులాల వెండి, రూ.11వేల నగదు, చికొండ్ర బాలమ్మ నివాసంలో ఒకటిన్నర తులాల బంగారం, 6 తులాల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం బాధితులు ఇంటికి రాగా తాళాలు విరగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లు భావించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న బంగారు, వెండి, నగదు లేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, క్లూస్‌టీం ఘటనా స్థలానికి చేరుకున్నారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని నాగనూలు చౌరస్తాలోని కిరాణం దుకాణంలో రూ.6 వేల నగదు, రూ.36 వేల విలువ చేసే కిరాణ సామగ్రిని ఎత్తుకెళ్లినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆరబోసిన ఎండు మిర్చి దగ్ధం



లింగాల మండలం బాకారంలో కాలిపోయిన ఎండు మిర్చిని పరిశీలిస్తున్న ఏఓ నాగార్జునరెడ్డి

లింగాల: మండల పరిధిలోని బాకారంలో శ్రీపతిరెడ్డి అనే రైతు వ్యవసాయ పొలంలో ఆరబోసిన ఎండు మిర్చి దగ్ధమై రూ.2.50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. రైతు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రెండున్నర ఎకరాల పొలంలో ఎండు మిర్చి పంటను సాగు చేశాడు. ఇందుకు దాదాపుగా రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. పంట దిగుబడి ఆశించిన మేరకు వచ్చింది. తెంపిన ఎండు మిరపకాయలను పంట పొలంలోనే ఆరబోశాడు. రాత్రి సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్‌సర్క్యూట్ జరిగింది. ఎండుగడ్డి కాలుతూ మిర్చికి అంటుకుందని రైతు విచారం వ్యక్తం చేశాడు. దాదాపు 16 క్వింటాళ్ల మిర్చి కాలి బూడిదయ్యిందని వాపోయాడు. నష్టపోయిన పంటకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని రైతు వేడుకుంటున్నాడు. ఎండు మిర్చి దగ్ధమైన విషయం తెలుసుకున్న మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి గురువారం సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.